సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

I

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



బంద్ ప్రశాంతం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలు అనుసరిస్తోందని ఆరోపిస్తూ శుక్రవారం చేపట్టిన గ్రామీణ బంద్, కార్మికుల సమ్మె జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. విద్యా, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి.

- వివరాలు లోపలి పేజీల్లో..

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి రథసప్తమిని పురస్కరించుకుని శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం చేశారు. అమ్మవారికి పంచహారతులు సమర్పించి నివేదన, నీరాజన మంత్రపుష్పం గావించారు. అంతకుముందు కుంకుమపూజ, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ సభ్యులు చింత నాగరాజు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం ఈఓ బదిలీ రద్దు

రమాదేవినే కొనసాగిస్తూ ఉత్తర్వులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓగా మళ్లీ ఎల్ రమాదేవినే కొనసాగనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టిన రమాదేవిని కీసర ఆర్డీఓగా బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, పలు సంస్కరణలు, ఆలయ ఆదాయం పెంపునకు ఈఓ పలు చర్యలు చేపట్టారని, ఆమెనే తిరిగి కొనసాగించాలని భక్తులు, ఆలయ సిబ్బంది ఇటీవల ఆందోళన చేశారు. ఈ క్రమంలో బదిలీ రద్దు చేస్తూ తిరిగి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న ఆడిట్..

దేవస్థానంలో ప్రత్యేక అధికారుల ఆడిట్ కొనసాగుతోంది. కాగా వెండి బిస్కెట్ కనిపించకపోవడంపై ఈఓ మాట్లాడుతూ.. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత వెండి, బంగారు ఆభరణాల జాబితా అప్పగించలేదన్నారు. వెండి బిస్కెట్ మాయంపై విచారణ జరుగుతోందని, అన్ని విభాగాల్లో పరిశీలించిన తర్వాత దీనిపై స్పందిస్తామని పేర్కొన్నారు. ఇందులో సిబ్బంది పాత్ర ఉంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని వెల్లడించారు.

సామాజిక సేవ అభినందనీయం

భారజల కర్మాగారం జీఎం జగ్గారావు



జీఎంకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ప్రిన్సిపాల్

అశ్వాపురం: మణుగూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని భారజల కర్మాగారం జీఎం జగ్గారావు అన్నారు. కర్మాగారం పరిపాలన విభాగం కార్యాలయంలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జీఎంను కలిసి గొందిగూడెంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. మణుగూరు డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక, సేవా, మరెన్నో కార్యక్రమాల పట్ల అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎనిమిది ప్రాజెక్టులు

కొత్తగూడెంఅర్బన్: గతేడాది జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో 86 ప్రాజెక్టులు అప్‌లోడ్ చేయగా 8 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని డీఈఓ వెంకటేశ్వరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు హర్షిత, రేష్మారెడ్డి, సాయిచరణ్, విఖిలేష్‌సాయి, మాధవి, శ్రీవర్షిక, భవ్యశ్రీ, ప్రశాంత్ మార్చిలో జరిగే పోటీలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి 386 ప్రాజెక్టులు అప్‌లోడ్ చేయగా, 77 ఉత్తమంగా ఎంపికయ్యాయని ఢిల్లీలోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి సమాచారం అందిందని తెలిపారు. ఎంపికైన ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేల చొప్పున విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని పేర్కొన్నారు.

రామభక్తుల కల..



సాకారమైన వేళ..

అయోధ్యలో బాలరాముడిని దర్శించుకునేందుకు రైల్వే అధికారులు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడంతో భక్తుల కల నెరవేరినట్టయింది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ రైలు భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌కు చేరుకోగా, తిరిగి వెళ్లేంతవరకు స్టేషన్ ఆవరణను రైల్వే, కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు ఆధీనంలోకి తీసుకుని భక్తులకు భద్రత కల్పించారు. స్టేషన్ ఆవరణలో టెంట్లు వేసి అయోధ్యకు వెళ్లే భక్తుల రిజర్వేషన్ల ఆధారంగా పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకుని, ఐడీ కార్డు అందజేశారు. ఈ కార్డు ఉన్నవారిని మాత్రమే రైలు వరకు అనుమతించారు. అయోధ్యకు వెళ్లే ప్రత్యేక రైలులో 20 బోగీలు ఉండగా ప్రతి బోగీ వద్ద రైల్వే పోలీసులు పర్యవేక్షించారు. దాదాపు నాలుగు గంటల పాటు భక్తుల శ్రీరామ నామస్మరణలతో స్టేషన్ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు స్థానిక గణేష్ టెంపుల్ అర్చకులు తిలకం దిద్ది, 108 రుద్రాక్షలతో ఉన్న జపమాల మెడలో వేశారు. – కొత్తగూడెంఅర్బన్



ప్రయాణికులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్న రైల్వే అధికారులు



రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు



రైలు కోసం వేచిచూస్తున్న భక్తులు

కొత్తగూడెం నుంచి అయోధ్యకు బయలుదేరిన రైలు

- తరలివెళ్లిన 468 మంది భక్తులు
- భారీ భద్రత ఏర్పాట్లుచేసిన అధికారులు
- జై శ్రీరాం నినాదాలతో మార్మోగిన రైల్వే స్టేషన్

468 మంది ప్రయాణం..

భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ నుంచి అయోధ్య వెళ్లేందుకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో 484 మంది భక్తులు రిజర్వేషన్ చేయించుకోగా, 468 మంది మాత్రమే రైలు ఎక్కారు. మిగతా వారు వివిధ కారణాలతో రాలేకపోయారని రైల్వే అధికారులు చెప్పారు. 1,696 కిలోమీటర్ల దూరం, 33.30 గంటల ప్రయాణానికి భక్తులు రిజర్వేషన్ చేయించుకోగా, టికెట్ చార్జీ రూ.1,810గా ఐఆర్‌సీటీసీ వారు నిర్ణయించారు. రైలు ఎక్కినప్పటి నుంచి బాలరాముడిని దర్శించుకుని తిరిగి వచ్చేంత వరకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రయాణంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనంతో పాటు సలార్‌పూర్ స్టేషన్‌లో రైలు దిగిన తర్వాత ప్రత్యేక వాహనాల్లో భక్తులను అయోధ్య తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేశామని అధికారులు వివరించారు. రైలులో భక్తులకు సేవలందించేందుకు ప్రత్యేకంగా 20 మంది సిబ్బందిని కేటాయించామని చెప్పారు. టికెట్ల పరిశీలన, ఇతర రైల్వే సమాచారం కోసం 17 మంది టీసీలను పంపించారు. వీరందరికి భద్రత కల్పించేందుకు రైల్వే పోలీసులతో పాటు కేంద్ర బలగాలను ఏర్పాటు చేశారు. కాగా, వెబ్‌సైట్‌లో అనేక సమస్యలు తలెత్తి చాలామంది భక్తులు టికెట్ బుక్ చేసుకోలేకపోయారని తెలుస్తోంది.

వెనుదిరిగిన కుటుంబం

మణుగూరు నుంచి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు అయోధ్య వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్నారు. ఏడేళ్లకు పైగా వయసున్న ఇద్దరు పిల్లలతో కలిసి రైలు ఎక్కేందుకు స్టేషన్‌కు వచ్చారు. అయితే ఆ ఇద్దరు పిల్లలకు టికెట్ బుక్ చేయకపోవడంతో రైల్వే టీసీలు నిరాకరించారు. దీంతో ఆ కుటుంబం దుఃఖిస్తూ వెనుదిరిగింది.

అయోధ్య వెళ్లడం రెండోసారి



అయోధ్యకు రైల్వే శాఖ వారు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడం సంతోషం. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అనంతరం నేను అయోధ్య వెళ్లడం ఇది రెండోసారి కావడం ఆనందంగా ఉంది. భక్తుల సౌకర్యార్థం అధికారులు నెలకోసారి రైలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – కమలమ్మ, ఇల్లెందు

ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోంది



రాముడి జన్మభూమి అయిన అయోధ్యకు వెళ్లాలనే ఎన్నో ఏళ్ల కల ఇప్పుడు నెరవేరుతోంది. బాలరాముడిని దర్శించుకునేందుకు రైల్వే అధికారులు మంచి అవకాశం కల్పించారు. భవిష్యత్‌లో కూడా ఇలా తరచుగా రైళ్లు నడిపిస్తే భక్తుల నుంచి మంచి ఆదరణ ఉంటుంది. – ఎల్.రమేష్, మణుగూరు

అయోధ్యకు వెళ్తాననుకోలేదు



అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ తర్వాత వెళ్లాలని చాలాసార్లు అనుకున్నా వెళ్లలేకపోయాం. ప్రస్తుతం రైల్వే అధికారులు కల్పించిన ప్రత్యేక రైలు సదుపాయంతో వెళ్లగలుగుతున్నాం. ప్రయాణికుల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన రైల్వే శాఖకు కృతజ్ఞతలు. – బి.శాంత, ఇల్లెందు

రైతన్నకు వెన్నుపోటు..

పంటల విక్రయాల్లో మోసాలు

- కల్లాల వద్దే కొనుగోలు పేరుతో రైతులకు ఎర
- తప్పుడు తూకంతో నిలువునా ముంచుతున్న దళారులు
- కొందరు వ్యాపారుల చర్యలతో చిత్తవుతున్న రైతులు



నిబంధనలు ఇలా..

రైతుల దగ్గరి నుంచి వ్యవసాయ ఉత్పత్తులు అంటే పత్తి, మిర్చి తదితర పంటలు కొనుగోలు చేయాలంటే వ్యాపారులు లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఈ లైసెన్స్‌లు జారీ చేసే సమయంలో వ్యాపారుల ఆర్థిక పరిస్థితి, గోదాముల నిల్వ సామర్థ్యం, కాంటాల పారదర్శకత తదితర వివరాలు తెలుసుకునే వీలుంటుంది. అంతేకాదు.. పత్తి, మిర్చి కొనుగోలు సమయంలో తూకం వేసేందుకు ఎలక్ట్రానిక్ కాంటాలను ఉపయోగించాలి. సంప్రదాయ రాళ్ల కాంటాల వాడకాన్ని తగ్గించాలి. ఈ కాంటాలను కూడా ప్రతీ వ్యవసాయ సీజన్‌లో తనిఖీలు చేసి సీల్ వేయాల్సి ఉంటుంది.

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: చీడపీడల బెడద, ప్రతికూల వాతావరణం, కల్తీ విత్తనాలు, మందుల కంటే కొందరు వ్యాపారులు, వారి తరపున పనిచేసే దళారుల కారణంగా రైతులకు ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. ఏజెన్సీ రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారి కష్టార్జితాన్ని దోచుకుంటున్నారు.

కష్టాలకు ఓర్చి పండించినా..

దుక్కి దున్నడం మొదలు పంట చేతికొచ్చే వరకు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయానికి వర్షాలు పడకపోయినా, అధికంగా వర్షాలు, వరదలు వచ్చినా ఇబ్బందే. ఇక విత్తనాలు మొదలు పురుగుల మందు వరకు ప్రతీచోట కల్తీ లేకుండా కొనుగోలు చేయడం కష్టమైన వ్యవహారంగా మారింది. ఇన్ని కష్టాలు పడినా పంట చేతికొచ్చే సమయంలో కోత కోసే కూలీల కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇన్ని కష్టాల మధ్య పంట దిగుబడిని సొమ్ము చేసుకునే సమయంలో కొందరు వ్యాపారులు, దళారులు ఏమాత్రం కనికరం లేకుండా తప్పుడు తూకాలతో రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు.

కాగితాలకే పరిమితమా..

కాగితాలపై నిబంధనలు ఘనంగా కనిపిస్తున్నా క్షేత్ర స్థాయిలో జరిగేది వేరుగా ఉంటోంది. లైసెన్సులతో పని లేకుండా కొందరు వ్యాపారులు, వారి తరఫున దళారులు నేరుగా గ్రామాలకు చేరుకుంటున్నారు. పొలాల వద్దనో, కల్లాల చెంతనో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు రైతులతో బేరం మాట్లాడుతున్నారు. తమతో పాటు తెచ్చిన కాంటాల్లో తూకం వేసి డబ్బులు ఇచ్చేసి వెళ్లిపోతున్నారు. తమ దగ్గరికే వచ్చి నేరుగా పంటలు కొనుగోలు చేస్తుండటంతో రైతులు కూడా వీరిని ఆదరిస్తున్నారు. వారిపై నమ్మకం పెట్టుకుంటున్నారు. కానీ ఇదే అలుసుగా తీసుకుంటున్న వ్యాపారులు.. అమాయక రైతులను మోసం చేస్తుండడం దిగ్భ్రాంతి కలిగించే అంశం. ఇప్పటికైనా వ్యవసాయ, మార్కెటింగ్, తూనికలు కొలతలతో పాటు సాగుతో సంబంధం ఉన్న ఇతర ప్రభుత్వ విభాగాలు రైతులు మోసపోతున్న అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఇటీవల వెలుగుచూసిన మోసాలిలా..

- ఈనెల 14న చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో మిర్చి రైతు ఇంటికి వచ్చిన వ్యాపారులు బేరం మాట్లాడుకున్నారు. తమతో పాటు తెచ్చిన ఎలక్ట్రానిక్ కాంటాలో మిర్చిని జోకగా 25.57 క్వింటాళ్లు వచ్చింది. అయితే అనుమానం వచ్చిన రైతులు మరో చోట కాంటా వేయగా మిర్చి 31.10 క్వింటాళ్లు ఉన్నట్టుగా తేలింది. ఇక్కడ తూకంలో 5.57 క్వింటాళ్ల మిర్చి తేడా వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర రూ. 20,000 ఉంది. అంటే సదరు రైతుకు జరిగిన నష్టం రూ.1.10 లక్షలు. దీంతో ఆగ్రహించిన రైతులు వ్యాపారులపై దాడి చేశారు.
- జనవరి 29న పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్‌లో పత్తి రైతుల ఇంటికే వచ్చిన దళారులు క్వింటాకు రూ. 5 వేల చొప్పున ధర మాట్లాడుకున్నారు. అనంతరం కాంటా వేసి ఏడు క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. ఇలా కొనుగోలు చేసిన పత్తిని ట్రాలీ ఆటోలో తీసుకెళ్తుండగా ఆ రైతుకు అనుమానం వచ్చింది. అదే పత్తి బస్తాలను మరో చోట తూకం వేయగా 11 క్వింటాళ్ల బరువు తూగింది. అంటే నాలుగు క్వింటాళ్ల పత్తి అదనంగా తీసుకున్నారు. ఇలా రైతు కష్టం నుంచి రూ. 20 వేలు కాజేసేందుకు సదరు వ్యాపారులు/దళారులు ప్రయత్నించారు. దీనిపై ఆగ్రహించిన రైతులు వ్యాపారులపై పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- ఈ ఏడాది ఆరంభంలో చర్ల మండలం దోసిళ్లపల్లి గ్రామంలో ఇలాంటి ఘటనే జరిగింది. పది క్వింటాళ్ల పత్తి కాంటాలో రెండు క్వింటాళ్లు తేడా వచ్చింది. జరుగుతున్న మోసాన్ని రైతులు పసిగట్టగడంతో బేరానికి వచ్చిన పత్తి వ్యాపారులు రాజీ చేసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. ఇవి మచ్చుకు కొన్ని సంఘటనలే. అసలు బయటకు రాకుండా ఇంకెన్నో ఇలాంటి మోసాలు జరుగుతున్నాయి. వీటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

అయోధ్య రామయ్య దర్శనం అదృష్టం

చుంచుపల్లి: అయోధ్య బాల రామున్ని దర్శించుకోవడం ఎంతో అదృష్టమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగా కిరణ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి అయోధ్య బయలుదేరిన రామ భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఏర్పాట్లపై రైల్వే అధికారులతో చర్చించారు. 500 సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న అయోధ్య రామ మందిర నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో పూర్తి కావడం, బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ అనంతరం అయోధ్యకు వెళ్లేందుకు రైల్వే శాఖ ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తాండ్ర వినోద్‌రావు, ఎడ్లపల్లి శ్రీనివాసకుమార్, పైడీపాటి రవీందర్, ఆకుల నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరెడ్డి, ఏనుగుల వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, చింతలంచెర్వు శ్రీనివాసరావు, బైరి నిర్మల, రాయుడు నాగేశ్వరరావు, కొమ్ము వంశీ, గొడుగు శ్రీధర్, పోడియం బాలరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఖేలో' సంబరాలు

- క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న ఉద్యోగులు
- నేటితో ముగియనున్న పోటీలు



టెన్నికాయిట్ పోటీల్లో మహిళా ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం, రామవరం, రుద్రంపూర్, కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో జరుగుతున్న ఖేలో భద్రాద్రి సంబరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. టీఎస్‌జీవోస్, జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ పురుష, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్, స్కిప్పింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన పోటీల్లో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి.సీతారాం, టీఎన్‌జీవోస్ రాష్ట్ర కార్యదర్శి జి. వీరబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రామనర్సయ్య, పి.ప్రకాష్, జానీమియా, జె.సోమయ్య, ఎం,విజయలక్ష్మి, జి.ఉష, కోచ్‌లు సన్నీ సోబర్స్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ముగింపు వేడుకలకు మంత్రులు పొంగులేటి, తుమ్మల

క్రీడా పోటీలు శనివారం ముగుస్తాయని, ఈ సందర్భంగా ప్రకాశం స్టేడియంలో జరిగే వేడుకలకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అమరనేని రామరావు, కంచర్ల సాయిభార్గవ్ తెలిపారు. స్టేడియంలో శుక్రవారం రాత్రి వారు విలేకరులతో మాట్లాడారు. నిత్యం విధుల్లో నిమగ్నమై ఉండే ఉద్యోగులకు కాస్త విరామం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సహకరించారని తెలిపారు. ముఖ్యంగా కలెక్టర్ ప్రియాంక ఆల ఎంతగానో సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. శనివారం చివరి రోజు సెమీఫైనల్, ఫైనల్ పోటీలు ఉంటాయని, విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

24 నుంచి డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 24 నుంచి 27 వరకు డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు జరగనున్నాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. డ్రాయింగ్ లోయర్ పరీక్ష బాబుక్యాంప్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, డ్రాయింగ్ హయ్యర్, టైలరింగ్ లోయర్, హయ్యర్ పరీక్ష పాత కొత్తగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఏసీజీఈ ఎస్.మాధరరావు(9989027943)ను సంప్రదించాలని తెలిపారు.

నివేదికలతో సిద్ధంగా ఉండండి

- త్వరలో ఐటీడీఏ పాలక మండలి సమావేశం
- పీఓ ప్రతీక్ జైన్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్, హాజరైన అధికారులు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఈ నెలలో జరిగే పాలక మండలి సమావేశానికి అన్ని శాఖల అధికారులు నివేదికలు, తగు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకమండలి సమావేశానికి రాష్ట్ర మంత్రులతో పాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, జెడ్పీ సీఈఓలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరవుతారని వివరించారు. అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ఇతర అంశాలపై అధ్యయనం చేయాలని సూచించారు. బడ్జెట్ ప్రతిపాదనలు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఐటీడీఏ కార్యాలయంతో పాటు పాలక వర్గ సమావేశం జరిగే గిరిజన భవనం, పరిసరాలు, గదులను శుభ్రం చేయాలని ఆదేశించారు. నివేదికల సమర్పణలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్ఓ సురేష్‌బాబు, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ఏఓ భీమ్, ఆర్ఓఎఫ్ఆర్ డీటీ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏడీ భాస్కర్, ఇతర అధికారులు మునీర్ పాషా, రమణయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సీసీ రోడ్లకు రూ.1.17 కోట్లు

- ఎంపీ నామ నాగేశ్వరరావు వెల్లడి



ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయిస్తున్నట్లు బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి గాను సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.1,17,50,500 మంజూరు చేసినట్లు వెల్లడించారు. భద్రాద్రి జిల్లాలోని మారుమూల గ్రామాల అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. అశ్వారావుపేట, చంద్రుగొండ, దమ్మపేట, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలకు చెందిన గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కల్వర్టులు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్ల ప్రహరీ నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు భద్రాద్రి జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి నిధులు భారీగా కేటాయిస్తుండగా, త్వరలోనే పనులకు శంకుస్థాపన చేస్తామని ఎంపీ నాగేశ్వరరావు వెల్లడించారు.

జిల్లా కోర్టులో రికార్డు గది ప్రారంభం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని జిల్లా కోర్టులో ఏర్పాటుచేసిన రికార్డు గదిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి శ్యాంశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి. భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బత్తుల రామారావు, మొదటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత, రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్, మూడో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.శిరీష పాల్గొన్నారు.

రామయ్యకు స్వర్ణకవచాలంకరణ



స్వామివారికి పూజ చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశాక బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

రామాలయంలో రథసప్తమి వేడుకలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని చంద్రప్రభ వాహనంపై చిత్రకూట మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంత్రోచ్ఛరణల నడుమ రాజవీధి మీదుగా తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ గావించారు. కార్యక్రమంలో ఈవో రమాదేవి పాల్గొన్నారు.

అలరించిన రామదాసు కీర్తనలు

భద్రాచలంటౌన్: రామాలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో నిర్వహిస్తున్న భక్త రామదాసు జయంతి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజున రామదాసు పదో తరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమృత వర్షిణి మ్యూజిక్ ఆకాడమీకి చెందిన 60 మంది గాయనీ గాయకులు ఆలపించిన కీర్తనలు అలరించాయి.

ఆర్టీసీకి సమ్మెపోటు

- ఉమ్మడి జిల్లాలో డిపోలకే పరిమితమైన బస్సులు
- సర్వీసులు నడవక ఆదాయం కోల్పోయిన సంస్థ
- రీజియన్‌లోని ఏడు డిపోల్లో రూ.60 లక్షల వరకు నష్టం



సమ్మెతో నిర్మానుష్యంగా మారిన కొత్తగూడెం బస్టాండ్



కొత్తగూడెంలో ఆర్టీసీ బస్సులను అడ్డుకుంటున్న కార్మిక సంఘాల నాయకులు

చుంచుపల్లి: సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ఆర్టీసీ సంస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ఉమ్మడి జిల్లాలో సగం సర్వీసులు డిపోలకే పరిమితమయ్యాయి. రీజియన్‌కు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సమ్మె చేపట్టగా, ఆర్టీసీలో విజయవంతమైంది. కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం 2,100 మంది కార్మికులు ఉండగా, సుమారు 1,300 మంది సమ్మె బాట పట్టారు. తెల్ల వారుజామునే డిపోల వద్దకు చేరుకున్న కార్మికులు, పలు పార్టీల మద్దతుదారులు బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు వివిధ రూట్లకు నడపాల్సిన బస్సులను డిపోల్లోనే నిలిపివేశారు. ఏ డిపోలో కూడా బస్సులు కదల్లేదు. భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం డిపోల్లో అద్దె బస్సుల యజమానులు సమ్మెకు మద్దతు తెలిపారు. తమ సర్వీసులను నిలిపివేశారు. కొందరు సిబ్బంది సాయంత్రం వరకు ఆందోళన కొనసాగించడంతో కొన్ని బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

రోడ్డెక్కింది 217 బస్సులే...

రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో మొత్తం 431 సర్వీసులు ఉండగా, 217 బస్సులు మాత్రమే రోడ్డెక్కాయి. భద్రాచలం డిపోలో 68 బస్సులకు గానూ 48 బస్సులు తిరిగాయి. కొత్తగూడెంలో 52 బస్సులకు 7, మణుగూరులో 56 బస్సులకు 10, ఇల్లెందులో 12 బస్సులకు 9 బస్సులు నడిచాయి. ఖమ్మం డిపోలో 112 బస్సులకు 62, మధిరలో 50 బస్సులకు 18, సత్తుపల్లి డిపోలో 81 బస్సులకు 63 తిరిగాయి. మొత్తం 198 ఆర్టీసీ బస్సులకుగాను 110, హైర్ సర్వీసులు 233కు గాను 107 బస్సులు నడిచాయి. బస్సులు నడవకపోవడంతో ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, సత్తుపల్లి, మధిర తదితర బస్టాండ్లు ఉదయం వేళ కొంత నిర్మానుష్యంగా కనిపించాయి. ఎనిమిది గంటల తర్వాత ప్రయాణికుల రద్దీ పెరిగినా బస్సుల్లేక గంటలకొద్దీ బస్టాండ్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉదయం వేళలో కొన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పలువురు ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

పోలీసుల బందోబస్తు..

సమ్మె ప్రభావంతో శుక్రవారం రీజియన్‌లో రూ.60 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సమ్మె ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన బస్టాండ్ ప్రాంగణాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూడు గంటలు బస్టాండ్‌లోనే..



నేను ఉదయం 8 గంటలకు విజయవాడ వెళ్దామని కొత్తగూడెం బస్టాండ్‌కు వచ్చాను. 11 గంటలకు బస్సు రాలేదు. దాదాపు మూడు గంటలపాటు బస్సుల కోసం ఎదురుచూశాను. బంద్ కొద్ది సేపూ మాత్రమే ఉంటుందని భావించి వచ్చాను. కానీ పరిస్థితి అలా లేదు. ఎటు వైపూ బస్సులు వెళ్లడం లేదు.

– ఎం.లక్ష్మి, కొత్తగూడెం

బస్సులు నడపలేకపోయాం...



కార్మికులు శుక్రవారం చేపట్టిన సమ్మె ఆర్టీసీపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఉదయమే కార్మికులు డిపోలకు చేరుకొని బస్సులను బయటకు రానివ్వలేదు. రీజియన్‌లో దాదాపు 75 శాతం మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. అన్ని ప్రధాన రూట్లకు బస్సులను నడపలేకపోయాం. ఏడు డిపోలు రోజువారీ ఆదాయాన్ని భారీగా కోల్పోయాయి.

– సీహెచ్.వెంకన్న, ఖమ్మం రీజినల్ మేనేజర్

సింగరేణిలో సమ్మె పాక్షికం

- రోజువారీ లక్ష్యంలో 10 శాతం తగ్గిన బొగ్గు ఉత్పత్తి
- నల్లబ్యాడ్జీలు ధరించి కార్మిక సంఘాల నాయకుల నిరసన



విధులకు భూగర్భ గనిలో దిగిన కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై వివిధ కార్మిక సంఘాలు ఒక్కరోజు తలపెట్టిన సమ్మె, గ్రామీణ బంద్ శుక్రవారం సింగరేణిలో పాక్షికంగా జరిగింది. కార్మికులు విధులకు హాజరుకాగా, బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపు సజావుగా సాగిందని సింగరేణి ఉన్నతాధికారులు తెలిపారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్యం ఐఎన్‌టీయూసీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కొత్తగూడెంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తదితరులు పీవీకే–5షాఫ్ట్ గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.

కొద్దిమేర తగ్గిన ఉత్పత్తి

సింగరేణి సంస్థలో సమ్మె కారణంగా 2 లక్షల టన్నులు అంటే 10శాతం బొగ్గు ఉత్పత్తి తగ్గింది. 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాల్సి ఉండగా 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ మాత్రమే తొలగించినట్లు అధికారులు తెలిపారు. కాగా, 39,010 మంది కార్మికులకు గాను 18,072 వేల మంది(60శాతం) విధులకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. మిగతా వారిలో 782 మంది సెలవులో ఉండగా, 13,957 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. కొత్తగూడెం ఏరియాలో బొగ్గు ఉత్పత్తి యథావిధిగా సాగిందని, సమ్మె ప్రభావం లేదని జీఎం శాలేంరాజు తెలిపారు.

డీపీఆర్వో బదిలీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): డీపీఆర్వో శీలం శ్రీనివాసరావు జయశంకర్ భూపాలపల్లికి బదిలీ అయ్యారు. సమాచారశాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీనివాసరావు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలను కలిసి మొక్కను అందజేశారు. సహాయ పౌరసంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎండీ అజ్గర్‌హుస్సేన్‌కు డీపీఆర్వోగా బాధ్యతలు అప్పగించారు.

టీజీఓఎస్ సభ్యత్వ నమోదు

కలెక్టరేట్‌లో శుక్రవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.విజ యకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రమేష్, కె.కనకదుర్గ, ఎండి ఖాసీం, సంతోష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్

జెడ్పీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.ప్రసూనరాణి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శేషు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు సమష్టిగా పనిచేసి జిల్లా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

పోలీసుల తనిఖీ

పాల్వంచరూరల్: ఓ ఇంట్లో గంజాయి ఉందనే అనుమానంతో పట్టణ ఎస్‌ఐ రాఘవయ్య సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీ ఎదురుగా, లక్ష్మీదేవిపల్లి పంచాయతీలో ఉన్న ఓ ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో ఉన్న ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐని వివరణ కోరగా.. గంజాయి, చోరీ కేసుల విషయమై తనిఖీలు చేపట్టామని, విచారణ సాగుతోందని తెలిపారు.

పూరిల్లు దగ్ధం

జూలూరుపాడు: మండల పరిధిలోని పడమటనర్సాపురం గ్రామ పంచాయతీ కాక్యాతండాలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదంతో పూరిల్లు దగ్ధమైంది. తండాకు చెందిన మాళోత్ బాబబూరావు కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రపోయే సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. దీంతో కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి.

క్లుప్తంగా

పాల్వంచ కమిషనర్ స్వామి బదిలీ రద్దు

పాల్వంచ: పాల్వంచ మున్సి పల్ కమిషనర్ అజ్మీరస్వా మి బదిలీ రద్దు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం తిరిగి ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజులక్రితం స్వామిని వరంగల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వర్తిస్తున్న యూసఫ్‌ను పాల్వంచకు బదిలీ చేశారు. అయితే తాజాగా యూసఫ్‌ను మిర్యాలగూడ కమిషనర్‌గా బదిలీ చేసి, స్వామిని ఇక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య చర్యలు



విద్యానగర్‌లో చెత్త తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చుంచుపల్లి: ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుద్ధ్యం లోపించిందని 'సాక్షి'లో శుక్రవారం వెలువరించిన 'పంచాయతీలు అస్తవ్యస్తం'కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన పలు గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. చుంచుపల్లి మండలం ఎన్‌కె నగర్, విద్యానగర్ బాబూక్యాంపు, రుద్రంపూర్, నందాతండా పంచాయతీల్లో వీధులు, రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. పంచాయతీ సిబ్బందితో డ్రెయిన్లను శుభ్రం చేయించారు.

బాధ్యతలు చేపట్టిన ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను



చంద్రభాను

ఇల్లెందు: ఇల్లెందు నూతన డీఎస్పీ నూనావత్ చంద్ర భాను శుక్రవారం బాధ్యతలు స్వీకరించా రు. దక్షిణమధ్య రైల్వేజోన్–2లో రోడ్‌సేఫ్టీ విభా గంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన రెండు రోజుల క్రితం ఇల్లెందుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించాక ఎస్పీ రోహిత్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీఎస్పీని సీఐలు, ఎస్‌ఐలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసుల సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా డీఎస్పీ తెలిపారు.

పట్టుదలతో పీజీటీ కొలువు

అశ్వారావుపేటరూరల్: స్వయం కృషి, పట్టుదలతో ఓ నిరుద్యోగి గురుకులంలో పీజీటీగా ఉద్యోగం సాధించాడు. అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన బండారు మణికంఠ ఎంఎస్సీ బీఈడీ పూర్తి చేశాడు. ఇతనికి 2013లో వివాహం కాగా, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలం అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పని చేయగా, కరోనా సమయంలో ఉద్యోగం పోయింది. దీంతో ఇంటి వద్దే ఓ చిన్నపాటి ఫ్యాన్సీ దుకాణం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పట్టుదలతో పోటీ పరీక్షలకు సిద్ధంకాగా, తాజాగా వెలువడిన గురుకుల ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో గణితం సబ్జెక్టులో 41వ ర్యాంక్ సాధించాడు. పీజీటీ పోస్టుకు అర్హత పొందాడు. విద్యాశాఖ ఉన్నతాధికారుల చేతులమీదుగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం ఆవరణలో పీజీటీ నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు మణికంఠను అభినందించారు.

అనుమతులు లేకపోతే కఠిన చర్యలు

అశ్వారావుపేటరూరల్: ఆస్పత్రులు, రక్తపరీక్షా కేంద్రాలకు అనుమతులు లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత హెచ్చరించారు. శుక్రవారం అశ్వారావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రులు, రక్త పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు, అర్హత వివరాలను పరిశీలించారు. చట్ట ప్రకారం ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, రక్త పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు. ఫైజ్ మొహిద్దీన్, ఇనాక్, పి.బేబి పాల్గొన్నారు.

పోడు సాగు అడ్డగింత

ములకలపల్లి : రింగిరెడ్డిపల్లి పంచాయతీ ధర్మన్ననగర్‌లో వలస ఆదివాసీల పోడు సాగును శుక్రవారం అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. జేసీబీ యంత్రాల సాయంతో కందకాలు తీసేందుకు ప్రయత్నించగా సాగుదారులు అడ్డుకోగా, వాగ్వాదం నెలకొని ఉద్రిక్తతకు దారితీసింది. కాగా ఆదివాసీలకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు.

నేటి నుంచి పామాయిల్ మొక్కల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ నర్సరీలో శనివారం నుంచి రైతులకు సబ్సిడీపై పామాయిల్ మొక్కలు పంపిణీ చేయనున్నట్లు ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్త పాస్ పుస్తకం లేకుండా సాగు చేసే భూమి కలిగి ఉన్న రైతులకు పాత భూమి రికార్డులపై సబ్సిడీ కింద మొక్కలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూఓలో 'ప్రాంగణం' విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయిలో 2, 4వ ర్యాంకులు



ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులతో మహిళా ప్రాంగణం అధికారి విజేత

ఖమ్మం అర్బన్: మహిళా ప్రాంగణాల్లో కొన్నేళ్ల క్రితం వరకు మహిళలకు కుట్లు అల్లికలు, కంప్యూటర్ శిక్షణ మాత్రమే ఇవ్వగా 2023 నుండి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా రెండేళ్ల ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు ప్రవేశపెట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అభ్యర్థులు ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో ప్రవేశాలు పొందగా ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి బ్యాచ్ విద్యార్థుల ప్రథమ సంవత్సరం ఫలితాలు తాజాగా వెల్లడయ్యాయి. ఈమేరకు ఖమ్మంకు చెందిన బైరం రచన, సలవాడి మనీల రాష్ట్రస్థాయిలో రెండు, నాలుగో ర్యాంకులు సాధించారని మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత తెలిపారు. జిల్లా స్థాయిలోనూ మొదటి పది ర్యాంకులు తమ విద్యార్థులే సాధించారని వెల్లడించారు.

ఉపాధి అవకాశాలను అందుకోవాలి

అశ్వారావుపేటరూరల్: ఎస్టీ, ఎస్సీ యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరాలని భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి వి.విజేత సూచించారు. అశ్వారావుపేటలో తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యాన మహిళలకు శనివారం ఇచ్చిన నైపుణ్య శిక్షణను ఆమె పరిశీలించి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, యువతులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కోఆర్డినేటర్ సత్యం, శిక్షణ నిర్వాహకులు సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.

జామాయిల్ రైతులకు మరింత భరోసా

ఐటీసీ సీఈఓ వద్దిరాజు కులకర్ణి



జామాయిల్ క్లోన్స్‌ను పరిశీలిస్తున్న సీఈఓ కులకర్ణి, అధికారులు

బూర్గంపాడు: జామాయిల్ సాగు చేస్తున్న రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యేలా అండగా నిలుస్తామని ఐటీసీ సీఈఓ వద్దిరాజు కులకర్ణి భరోసా ఇచ్చారు. ఐటీసీ పీఎస్‌పీడీ ప్లాంటేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలోని ఐటీసీ నర్సరీలో శుక్రవారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల పరిశోధనల అనంతరం ఐటీసీ జామాయిల్స్ క్లోన్స్ రైతులకు అందిస్తోందని తెలిపారు. కర్బన ఉద్గారాలను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు మేలు చేసే రకాలనే ఇస్తున్నామని చెప్పారు. గత ఏడాది 50లక్షల మెట్రిక్ టన్నుల కార్బన్ ఉద్గారాలను జామాయిల్ మొక్కల సాగుతో తగ్గించామన్నారు. జామాయిల్ సాగుపై రైతులు అపోహలు విడనాడాలని.. వర్షాభావం ఎదురైనా, అధిక వర్షపాతం నమోదైనా నష్టం ఉండదని తెలిపారు. ఆసియాలోనే అతిపెద్ద పేపర్ పరిశ్రమ అయిన ఐటీసీ పీఎస్‌పీడీ ముడిసరుకు అందిస్తున్న జామాయిల్ రైతులకు అన్నివిధాల అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఎకరాకు 50 టన్నుల జామాయిల్ కర్ర దిగుబడి సాధించిన 26మంది రైతులకు ప్రాంతాల వారీగా ప్రోత్సాహక అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ సిద్ధార్థ మొహంతి, వివిధ విభాగాల అధికారులు సునీల్ పాండే, రాజశేఖర్, అమిత్‌సింగ్, జగదీష్ తమక్, సురేష్‌రెడ్డి, కేవీకే ప్రొఫెసర్ లక్ష్మీనారాయణమ్మ తదితరులు రైతులు పాల్గొన్నారు.

తూకంలో దళారుల దగా

- ఆర్థికంగా నష్టపోతున్న మిర్చి రైతులు
- నెలరోజులుగా సాగుతున్న అక్రమ వ్యాపారం

చండ్రుగొండ : దళారులు తూకంలో మోసం చేయడంతో మిర్చి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. తల్లాడ మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యాపారులు బెండాలపాడులో మిర్చి కాంటాలో మోసం చేస్తున్న ఉదంతం బయటపడటంతో మండలంలోని మిర్చి రైతులు ఉలిక్కిపడ్డారు. మండలంలోని తిప్పనపల్లి, బాలికుంట, సీతాయిగూడెం, రావికంపాడు, అన్నపురెడ్డిపల్లి మండలంలోని మర్రిగూడెంతోపాటు మరికొన్ని గ్రామాల్లోనూ ఆ వ్యాపారులే మిర్చి కొనుగోళ్లు చేసినట్లు రైతులు చెప్తున్నారు. తాము కూడా మోసపోయామోనని లబోదిబోమంటున్నారు. ఈ అక్రమ వ్యాపారం మండలంలో నెలరోజులుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. బెండాలపాడు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మాచినేని రవి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. తిప్పనపల్లికి చెందిన రైతులు కన్నెబోయిన నాగేశ్వరరావు, వేల్పుల శేఖర్, ఎస్డీ అమీర్‌హుసేన్ తాజాగా పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. గ్రామాల్లో దళారీ వ్యాపారులపై నిఘా పెంచి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖాధికారులు చేపట్టాలని రైతుసంఘాలు కోరుతున్నాయి.

ఇద్దరు దళారులపై కేసు నమోదు

తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన వ్యాపారులు దేవరుపల్లి నర్సింహారావు, ఎస్కే దస్తగిర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాచినేని రవి శుక్రవారం తెలిపారు. మిర్చి తూకంలో మోసం చేసినట్లు బెండాలపాడుకు చెందిన రైతు తేజావత్ సురేష్‌తోపాటు మరికొందరు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కాపర్ వైరు చోరీ

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి ఈర్యాతండా, బొమ్మనపల్లి, కొత్తతండా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి కాపర్ వైరు, విద్యుత్ తీగలను దుండగులు చోరీ చేశారు. వీటి విలువ రూ.16వేలు ఉంటుందని బొమ్మనపల్లి ఏఈ బుజ్జికన్నయ్య తెలిపారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పక్కాగా మేడారం జాతర ఏర్పాట్లు



భద్రాచలంలో సూచనలు చేస్తున్న ఆర్‌ఎం

చుంచుపల్లి: మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ పరంగా ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న సూచించారు. ఆయన శుక్రవారం ఏటూరు నాగారం, మణుగూరు, భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెంల్లో పర్యటించి బస్టాండ్లలో జాతర భక్తుల చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ 18వ తేదీ నుంచి మేడారం ప్రత్యేక బస్సులు ప్రారంభిస్తున్నందున బస్టాండ్ ప్రాంగణాల్లో తాగునీటి సౌకర్యం కల్పించి చలువ పందిళ్లు, టెంట్లు వేయించాలని సూచించారు. ఈసారి జాతరకు మహిళలు అధిక సంఖ్యలో వెళ్లే అవకాశమున్నందున తాత్కాలిక మరుగుదొడ్లను సైతం అందుబాటులో ఉంచాలని చెప్పారు. కొత్తగూడెం, భద్రాచలం డిపో మేనేజర్లు బాణాల వెంకటేశ్వరరావు, రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని శుక్రవారం అదృశ్యమైంది. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం .. మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని, స్థానిక ఓ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఉదయం పాఠశాలకు వెళ్లిన కొద్ది సేపటికే కడుపులో నొప్పి వస్తుందని, తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. అనంతరం తన స్నేహితురాలి అన్నయ్య ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరింది. మార్గమధ్యలో గ్రామస్తులు కలవడంతో వారితో వెళ్తానంటూ చెప్పి బైక్ దిగిపోయింది. సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవడంతో విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పందెంరాయుళ్లపై కేసు నమోదు

దమ్మపేట: మండలంలోని రాచూరిపల్లి గ్రామ శివారులో కోడిపందేల శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేసి కేసు నమోదు చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు కోడి పుంజులు, రూ.2,060 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

నాలుగు క్వింటాళ్ల గంజాయి స్వాధీనం?

భద్రాచలంఅర్బన్: ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని భద్రాచలం పట్టణంలో శుక్రవారం ఉదయం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి హైదరాబాద్ వెళ్తున్న సంగీత ట్రావెల్స్ బస్సులో సుమారు నాలుగు క్వింటాళ్ల గంజాయిని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. 8 మంది నిందితులను అదుపులోకి తీసుకోగా, స్థానిక పోలీసులు విచారిస్తున్నారని, పట్టుబడిన వ్యక్తులు హరియాణా రాష్ట్రానికి చెందిన వారని సమాచారం. కాగా ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

ఆటో అదుపుతప్పి నలుగురికి గాయాలు

పాల్వంచరూరల్: ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని పాలకోయతండాకు చెందిన ఉదయ్, రాజు, ఆనంద్, కోటి శుక్రవారం ఉల్వనూరుకు వెళ్లి తిరిగి ఆటోలో వస్తున్నారు. ఈక్రమంలో మందెరకలపాడు శివారులో మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి.


వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: వ్యక్తి ఆత్మహత్య ఘటనలో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన హింగ్ సతీష్(40) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా , చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్ చోరీ

పాల్వంచరూరల్: దుండగులు చేతిలో స్మార్ట్ ఫోన్ లాక్కుని ఉడాయించిన సంఘటన కలెక్టరేట్ సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. ఖమ్మంలోని కవిరాజ్‌నగర్‌కు చెందిన మేకల సుమతి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిసోంది. ఎప్పటిలాగే శుక్రవారం మధ్యాహ్నం బస్సు దిగి కళాశాలకు ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె చేతిలో ఉన్న ఫోన్ లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు.

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహారాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



మీ కిడ్నీలు కుశలమేనా?

తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయించుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి.



● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపిస్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి ● కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది ● చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది ● నోటి దుర్వాసన ఉంటుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది ● వాంతి వచ్చినట్లుగా... వికారంగా అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతావరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకుతారు.

పైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతోపాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

వెడ్డింగ్ ప్లాన్

సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపడమవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.



భారతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరఫు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెనుకాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.



ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలించుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గించవచ్చు. అదెలాగో చూద్దాం...

ముందస్తు ప్రణాళిక ...
పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.

అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం...
పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయిస్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. సేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వస్తారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

ముందుగా బడ్జెట్ వేసుకోండి... పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకోవాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకోవడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.

క్యాటరింగ్: పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్లలో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజరయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.



అలంకరణ సామగ్రి
పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమైనవి. వాటిని చౌకగా ఉన్న ప్రదేశాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.



హనీమూన్ ట్రిప్... పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేషన్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచుకుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవుతుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.

లైఫ్@360




శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచేయడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

మూడ్‌ని మార్చే ఫుడ్

ఒక్కొక్కసారి మనకు తెలియకుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలితిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసుకుందాం...



పాలకూర.. ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహారంలో తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



మష్రూమ్స్.. మష్రూమ్స్ యాంటీ డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబంధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగాలను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజనకరంగా ఉంటుంది.

అవకాడో.. కొద్దికాలం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బి3 ,ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్‌లు సంతోషకరమైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్ శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకాడోను చేర్చవచ్చు.



డ్రై ఫ్రూట్స్.. ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.

డార్క్ చాకొలేట్.. ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలేట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయిలను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది.



మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.

సినిమా

దేవర డేట్ ఫిక్స్



● ఎన్టీఆర్

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం



● రాజేంద్రప్రసాద్, జయప్రద

'ఈ ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయిపోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

అన్యాయంపై పోరాటం



● అనుష్క

'అరుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటుకుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీకరించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మహారాజా?



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందించిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.

మళ్లీ వస్తున్నాడు జోకర్



● 'జోకర్ 2' పోస్టర్

హాలీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

థ్రిల్ స్టార్ట్



● మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామాయణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.

యుద్ధానికి సిద్ధం!



● హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతున్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

రీల్స్

పెళ్లనేది పాన్ ఇండియా సమస్య



● 'అల్లరి' నరేశ్

'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడిగితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...



● యువ చంద్రకృష్ణ

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వవ్వారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సందె వేళ...



● శాంతి చంద్ర, దీపికా సింగ్

శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

ప్రేమ.. నవ్వులు



● గౌతమ్, పరశురామ్

గౌతమ్ సాగి, దీప్శికా జంటగా చంద్ర శేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘురామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చందమామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.